

ఊరంతా సందడి



తిమ్మాపూర్: బతుకమ్మ అంటే పూల పండుగ, ఆడబిడ్డల పండుగ, ఊరంతా సందడిగా ఉంటుంది. తొమ్మిది రోజులు రోజొక్క పేరుతో ఆడుతాం. ఎక్కడ వున్నా బతుకమ్మ పండుక్కి సొంత ఊరికి వెళ్తాం. ఈ పండుగ ప్రకతిని, దేవుడిని పూజించడంతో పాటు చల్లని శీతాకాలం ప్రారంభాన్ని సూచిస్తుంది. బతుకమ్మ పండుగ మహిళలకు ప్రత్యేకంగా ఉండడం మా అదృష్టం.

– మీన అపర్ణ, గృహిణి, తిమ్మాపూర్

పాటలు, పువ్వులతో ఆహ్లాదం



తిమ్మాపూర్: బతుకమ్మ పాటల్లో కష్ట సుఖాలు, ప్రేమ, స్నేహం, బంధుత్వం, ఆప్యాయత, భక్తి ఉంటుంది. రకరకాల పువ్వులు రంగురంగులలో పూసి ఉంటాయి. గునుగు, తంగేడు పూలు బాగా ఎక్కువగా పూస్తాయి. ఆడపడుచులు ప్రకృతి సౌందర్యాన్ని అద్భుతమైన రంగురంగుల పువ్వులతో కీర్తిస్తూ పండుగను జరుపుకుంటారు.

– లింగంపల్లి రాధ, మైనార్టీ స్కూల్ టీచర్, తిమ్మాపూర్

రోజుకో ప్రత్యేకత..



తిమ్మాపూర్: తెలంగాణకు మాత్రమే ప్రత్యేకమైన పండుగ. రాష్ట్రం వచ్చాక పండుగ ఎంతో ప్రాచుర్యంలోకి వచ్చింది. బొడ్డెమ్మ మొదలు సద్దుల బతుకమ్మ వరకు రోజుకో ప్రత్యేకత. ఇంటి దేవతగా కొలుస్తాం. చిన్నప్పటి నుంచి మా ఇంట్లో అమ్మమ్మ, అమ్మ అక్కలతో కలిసి బతుకమ్మను పేర్చడం అందులో నైపుణ్యాన్ని ప్రదర్శించడం చాలా సంతోషంగా ఉంటుంది. పోటాపోటీగా బతుకమ్మను పేరుస్తాం.

– మాచిడి అనిత, మైనార్టీ స్కూల్ లెక్చరర్, తిమ్మాపూర్

క్లుప్తంగా

వైద్యశిబిరం



పరీక్షలు చేస్తున్న డాక్టర్ సంధ్యారాణి

జమ్మికుంట: మున్సిపల్ పరిధి కేశవపూర్, ధర్మారం గ్రామాల్లో వావిలాల పీహెచ్‌సీ డాక్టర్లు సంధ్యారాణి, విజయ్ ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈసందర్భంగా 123 మందికి పరీక్షలు చేసి మందుల పంపిణీ చేశారు. జ్వర పీడితులకు రక్త నమూనాలు సేకరించి పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపించారు. అనంతరం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ అరుణ, ఏఎన్‌ఎంలు సరళ, కవిత, హెల్త్ అసిస్టెంట్ నరేందర్, కౌన్సిలర్ భిక్షపతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్రాహ్మణకుంటను పరిశీలించిన ఇరిగేషన్ అధికారులు

చొప్పదండి: పట్టణ శివారులోని బ్రాహ్మణకుంటను నీటిపారుదలశాఖ అధికారులు సోమవారం పరిశీలించారు. బ్రాహ్మణకుంటలో అవకతవకలు జరిగాయని వచ్చిన ఫిర్యాదు మేరకు ముఖ్య ఇంజినీర్ ఆదేశాల మేరకు పర్యవేక్షక ఇంజినీర్ ఆధ్వర్యంలో మోకాపై విచారణ జరిపారు. కుంట శిఖం హద్దులను పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కార్యనిర్వాహక ఇంజినీర్ సుధాకిరణ్, ఉపకార్యనిర్వాహక ఇంజినీర్ రూప్లా నాయక్, సహాయ కార్యనిర్వాహక ఇంజినీర్, తదితరులు పాల్గొన్నారు.

ఏడేళ్ల సమస్యకు పరిష్కారం

మానకొండూర్: మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామంలో ఏడేళ్ల భూ సమస్యకు తెరపడింది. తన భూమిని ఆక్రమించుకున్నారని ఏళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్న బాధితుడికి సోమవారం అధికారులు భూ సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయడంతో భూ సమస్యకు పరిష్కారం దొరికినట్టయ్యింది. సర్వే అధికారులు, బాధితుడు తెలిపిన వివరాలు... ఆకుల బాపురావుకు గట్టుదుద్దెనపల్లి శివారులోని 316 సర్వే నంబరులో 18 గుంటల భూమి ఉంది. తన భూమిని గ్రామానికి చెందిన పాండ్రాల మల్లయ్యకు చెందిన కుమారులు కొంత ఆక్రమించారని గతంలో రెవెన్యూ, సర్వే అధికారులకు దరఖాస్తు చేసుకున్నాడు. అయితే సర్వే అధికారులు పలుమార్లు భూ కొలతలు నిర్వహించినా ఎటూ తేలలేదు. కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్ ఆదేశాల మేరకూ సర్వే ల్యాండ్ రికార్డు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ మోహిజ్ గ్రామానికి చేరుకుని 316 సర్వే నంబరులోని 18 గంటలు భూమి, 315 సర్వే నంబర్‌లోని 28 గుంటల భూమికి కొలతలు నిర్వహించి హద్దులు ఏర్పాటు చేశారు.

టీషర్టులు అందజేత



మానకొండూర్: మానకొండూర్ సీఐ లక్ష్మీనారాయణ సోమవారం మండల కేంద్రంలో వాకర్స్‌కు టీ షర్టులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మంచి ఆరోగ్యం కోసం వ్యాయామం, యోగా, వాకింగ్ వంటివి ప్రతిరోజు చేయడం వల్ల ఒత్తిడి తగ్గించుకోవడంతోపాటు హుషారుగా ఉంటారని అన్నారు. యువత మంచి కార్యక్రమాలు చేపడుతూ ఆదర్శంగా నిలవాలని కోరారు.

శ్రీభక్తాంజనేయస్వామి ఆలయంలో ప్రణవ్ పూజలు



జమ్మికుంట: మండలంలోని నాగారం శ్రీభక్తాంజనేయస్వామి దేవాలయంలో కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆంజనేయస్వామి విగ్రహానికి మకర తోరణం బహూకరించారు. నాగారం నుంచి ఎల్లంపల్లి వెళ్లే మట్టిరోడ్డు పూర్తిగా ధ్వంసమైందని మరమ్మతులు చేయాలని గ్రామస్తులు కోరగా మంత్రితో మాట్లాడి నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని గడపగడపకు అందించేందుకు చర్యలు చేపడుతామన్నారు.

చర్యలు తీసుకోవాలి

గన్నేరువరం: బెజ్జంకి మండలం గుండారంలోని ఫామ్‌హౌజ్‌కు అక్రమంగా కెనాల్ నీటిని తరలిస్తున్న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌పై అధికారులు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు సంపతి ఉదయ్‌కుమార్ కోరారు. మాదాపూర్‌లో సోమవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. భు కబ్జాలకు పాల్పడి అధికార దుర్వినియోగం చేశారని, ప్రశ్నించినవారిపై అక్రమ కేసులు పెట్టించారని, రేగులపల్లిలో కోళ్లఫారం నిర్మించారని తెలిపారు. కబ్జా చేసిన భూములను స్వాధీనం చేసుకొని పేదలకు పంచాలని డిమాండ్ చేశారు.

జై భవాని.. జైజై భవాని



చొప్పదండి: కుంకుమపూజ చేస్తున్న మహిళలు



హుజూరాబాద్‌లో బోనాలతో కళాకారులు



రామడుగు: గోపాల్‌రావుపేటలో చండీయాగం



జమ్మికుంట: మొక్కులు చెల్లించుకుంటున్న మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు, తదితరులు

చొప్పదండి: పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఏర్పాటు చేసిన దుర్గామత మంటపంలో మహిళలు సోమవారం కుంకుమ పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని కనుకులగిద్దె గ్రామంలో శ్రీ గణేశ్ యూత్ ఆధ్వర్యంలోని దుర్గామాత ఆలయం వద్ద కుంకుమపూజ నిర్వహించారు. యూత్ సభ్యులు, గ్రామ మహిళలు పాల్గొన్నారు. పట్టణంలోని ప్రతాపవాడలో దుర్గామాతకు భక్తులు ప్రత్యేక పూజలు, బోనాల వేడుకను కందుల సందీప్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కళాకారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. యూత్ సభ్యులు మనోహర్, కృష్ణ, విజయ్, శరత్, హరిష్,దిలీప్,రుత్విక్ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంట: పట్టణం, మండలంలో దుర్గామాత మండపాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారు ప్రత్యేక అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. మున్సిపల్ పరిధి మోత్కులగూడెంలో మహంకాళీ యూత్ ఆధ్వర్యంలోని మండపంలో పీఏసీఎస్ చైర్మన్, కౌన్సిలర్ పొనగంటి సంపత్, శ్రీలత ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు., మహాఅన్నదానం కార్యక్రమం చేపట్టారు. మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, తహసీల్దార్ రమేశ్, మాజీ సర్పంచ్ పొనగంటి మల్లయ్య, కౌన్సిలర్లు రాము, శ్రీనివాస్, రమేష్, మద్ది లావణ్యతోపాటు గ్రామస్థులు, భక్తులు భక్తి మొక్కలు చెల్లించుకున్నారు.

వీణవంక: మండలంలోని బేతిగల్ శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో ప్రతిష్టించిన దుర్గమాత విగ్రహం వద్ద మహా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. మద్ది చిరంజీవి ఆధ్వర్యంలో చేపట్టిన అన్నప్రసాదానికి భక్తులు తరలివచ్చారు. అర్చకులు నరసింహాచార్యులు, సభ్యులు దేవరాజ్, సాయికుమార్, హరీశ్, అభిరామ్, భాస్కర్, గణేశ్, సతీశ్, అంజి తదితరులు ఉన్నారు.

రామడుగు: గోపాల్‌రావుపేట గ్రామంలో చండీయాగం నిర్వహించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలతో అన్నప్రసాద వితరణ చేశారు.



చిగురుమామిడి: మండలంలోని నవాబుపేట్ గ్రామంలో సింగిల్ ఫేజ్ బోరుమోటార్లు పనిచేయక గ్రామస్తులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఒకటి, ఎనిమిదో వార్డుల్లోని బోర్ మోటార్లు, స్టాటర్లు కాలిపోయినా పంచాయతీ కార్యదర్శి, ప్రత్యేకాధికారి పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదేంటని అడిగితే దాతలతో గ్రామాన్ని అభివృద్ధి చేయిస్తామంటున్నారని వాపోయారు. సమస్యలపై స్పందించకుంటే ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరిస్తున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
సంపత్, కార్యదర్శి, నవాబ్‌పేట్, సెల్ నంబర్: 8099650001

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9848408781, 8790144227, 9553955664

పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

గన్నేరువరం: పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. గన్నేరువరంలోని రైతువేదికలో ఆదివారం 37 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం మాదాపూర్ ఊరచెరువు కట్టపై రూ.20 లక్షలతో చేపట్టిన హైమాస్ట్ లైట్ల ఏర్పాటు పనులను పరిశీలించారు. తహసీల్దార్ నరేందర్, ఏవో కిరణ్మయి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి అనంతరెడ్డి, ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, కార్యదర్శి సునిల్, గ్రామ శాఖ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, డైరెక్టర్ అనిల్, నాయకులు మల్లేశం, సంపత్‌రెడ్డి, మల్లారెడ్డి, పరిపూర్ణచారి, తిరుపతిగౌడ్, సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

మానకొండూర్‌రూరల్: ఎంపీడీవో కార్యాలయంలో సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. మార్కెట్ కమిటీ అధ్యక్షుడు ఓదెలు, ఎంపీడీవో వరలక్ష్మి, ఉపాధ్యక్షుడు తిరుమల్‌రెడ్డి, నాయకులు నందగిరి రవీంద్రాచారి, దేవేంద్ర, రాజయ్య, సంపత్, దేవయ్య పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం రైతువేదికలో సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే లబ్ధిదారులకు పంపిణీ చేశారు. తహసీల్దార్ భాస్కర్, మాజీ జెడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బస్వయ్య, తిరుపతి, మల్లారెడ్డి, ఆరీఫ్, సదానందం, తదితరులు ఉన్నారు.

సమస్యలను పరిష్కరిస్తా

తిమ్మాపూర్: ఎల్ఎండీ కాలనీలోని ప్రజాభవన్ (క్యాంపు కార్యాలయంలో) అందుబాటులో ఉంటున్నాని సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. నీటి పారుదలశాఖ కార్యాలయాలకు కూతవేటు దూరంలో కార్యాలయం ఉందని, మహిళా ఉద్యోగులు సమస్యలు తెలియజేస్తే సత్వరం పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఎల్ఎండీ కాలనీలోని ఈఎన్‌సీ కార్యాలయం నుంచి తమ కార్యాలయాలకు వెళ్తున్న మహిళా ఉద్యోగులతో మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా లేనప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులకు ఒకటో తేదీన వేతనాలు చెల్లిస్తోందన్నారు. ఐదు డీఏలు, ఇతర బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని ఉద్యోగులు ఎమ్మెల్యేకు విన్నవించగా బిల్లుల చెల్లింపునకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

కరీంనగర్ కల్చరల్: కరీంనగర్ మహాశక్తి అమ్మవారిని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు పురమల్ల శ్రీనివాస్ దర్శించుకున్నారు.



గన్నేరువరం: సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

దరఖాస్తుల ఆహ్వానం



జమ్మికుంట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి గెస్ట్ ఫ్యాకల్టీగా కంప్యూటర్ సైన్స్, అప్లికేషన్స్ సబ్జెక్టు బోధించుటకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపల్ డాక్టర్ బి.రమేశ్ సోమవారం ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో పీజీ చేసి ఓసీ, బీసీ అభ్యర్థులు 55శాతం, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులై , పీహెచ్‌డీ, నెట్, సెట్ ఉన్న వారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 14వ తేదీలోపు కళాశాలలో దరఖాస్తులు అందజేయాలని, ఇంటర్వ్యూ తేదీని దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సెల్‌ఫోన్ ద్వారా తెలియజేస్తామని ప్రిన్సిపల్ పేర్కొన్నారు.

టీజీపీఆర్టీయూ రాష్ట్ర కౌన్సిల్‌కు తరలిన ఉపాధ్యాయులు



కౌన్సిల్ సమావేశానికి తరలివెళ్తున్న పీఆర్టీయూ సంఘం నాయకులు

జమ్మికుంట: హైదరాబాద్‌లో నిర్వహించే టీజీపీ ఆర్‌టీయూ 35వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలకు జమ్మికుంట పట్టణానికి చెందిన ఉపాధ్యాయ సంఘం నాయకులు సోమవారం తరలివెళ్లారు. రెండు రోజుల పాటు సమావేశాలు జరుగుతాయని, ఉపాధ్యాయుల సమస్యల పట్ల పరిష్కారం కోసం సమావేశంలో చర్చించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం నాయకులు మహేశ్, అచ్చె మురళి, ప్రభాకర్‌రెడ్డి, పైడిపల్లి చంద్రమోహన్, తిప్పని వెంకట్రాజం, జయప్రకాశ్, కృష్ణమూర్తి, సంతోష్‌కుమార్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సద్దుల బతుకమ్మకు ఏర్పాట్లు

హుజూరాబాద్‌రూరల్: పట్టణ శివారులోని బతుకమ్మ సొవళ్ల ప్రాంతంలో సద్దుల బతుకమ్మ ఏర్పాటన్లు మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక సోమవారం అధికారులతో కలిసి పరిశీలించారు. మహిళలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, అన్నిశాఖల సమన్వయంతో కార్యక్రమం విజయవంతం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నామని అన్నారు. కార్యక్రమంలో కమిషనర్ సల్వాది సమ్మయ్య, శానిటరి ఇన్‌స్పెక్టర్ కిషన్ రావు, శానిటరీ జవాన్లు తదితరులు ఉన్నారు.

రామడుగు: మండలంలోని పలు గ్రామాల్లో ఈ నెల 10వ తేదీన నిర్వహించనున్న బతుకమ్మ పండుగ సంబరాలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. బతుకమ్మ ఆడే ప్రదేశాలను శుభ్రం చేయడంతో పాటు గుంతల రోడ్లను మట్టి పోసి బాగు చేస్తున్నారు. గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారులు పర్యవేక్షణలో వీధి దీపాల ఏర్పాటుతో పాటు బతుకమ్మ నిమజ్జనం చేయడానికి అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నారు.



బతుకమ్మ సొవళ్ల ప్రాంతంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రాధిక, అధికారులు

రాంలీలా విజయవంతం చేయండి



ఎమ్మెల్యేను ఆహ్వానిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు




కరపత్రం ఆవిష్కరిస్తున్న ఎస్సై అనూష

చొప్పదండి: పట్టణంలోని క్రీడా మైదానంలో దసరాను పురస్కరించుకొని నిర్వహించే రాంలీలా ఉత్సవాన్ని విజయవంతం చేయాలని వీహెచ్‌పీ మండల శాఖ అధ్యక్షుడు పడకంటి కృష్ణ కోరారు. ఈ మేరకు రాంలీలా ఉత్సవ కరపత్రాన్ని ఎస్ఐ గొల్లపల్లి అనూష సోమవారం ఆవిష్కరించారు. కృష్ణ మాట్లాడుతూ.. హిందూ సంస్కృతి, సాంప్రదాయాలను పెంపొందించేలా ఉత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామని, హిందూబాంధవులందరు పెద్దఎత్తున పాల్గొని ఉత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. చేపూరి సత్యనారాయణ, ఎన్నం మునీందర్, మొలుమూరి రమేశ్, దండె లింగన్న, సిరిపురం శ్రీనివాస్, దూస రాము, తోట కోటేశ్ పాల్గొన్నారు.

రాంలీలా ఆహ్వాన పత్రిక అందజేత

తిమ్మాపూర్: మండలంలోని మహాత్మానగర్ గ్రామ పంచాయతీ పరిధి ఎల్ఎండీ కాలనీలోని ఎస్సారెస్పీ మైదానం(రాంలీలా)లో 12న నిర్వహించే దసరా వేడుకలకు రావాలని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణను ఉత్సవ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. ఉత్సవ కమిటీ కన్వీనర్ కుంట రాజేందర్‌రెడ్డి, కోకన్వీనర్ గవ్వ రాజేందర్ రెడ్డితోపాటు సభ్యులు ప్రజాభవన్(క్యాంపు కార్యాలయం)లో ఎమ్మెల్యేను సోమవారం కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, భక్తులు ఇబ్బందులు పడకుండా అవసరమైన వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. ఉత్సవ కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణగౌడ్, మోరపల్లి రమణారెడ్డి, తుమ్మనపల్లి శ్రీనివాస్‌రావు, కొండల్‌రావు, నోముల అనిల్, అనిల్, రవి పాల్గొన్నారు.

నియామకం



అన్నం ప్రవీణ్

ఇల్లందకుంట: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం వ్యవస్థాపకుడు డా.చీమ శ్రీనివాస్ సారథ్యంలో సోమవారం రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండలంలోని పాతర్లపల్లి గ్రామానికి చెందిన అన్నం ప్రవీణ్ యువజన విభాగం రాష్ట్రకో–కన్వీనర్‌గా నియామకమయ్యారు. ఈ సందర్భంగా ప్రవీణ్ టీయూఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌కు, నియామకానికి సహకరించిన వారందరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఫోరం బలోపేతానికి నిత్యం కృషి చేస్తానని పేర్కొన్నారు.

లింగమూర్తి కుటుంబానికి అండగా సీపీఐ

చిగురుమామిడి: మండల కేంద్రానికి చెందిన ఆర్టీసీ కండక్టర్ రాకం లింగమూర్తి ఆదివారం మృతిచెందగా ఆయన కుటుంబాన్ని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి సోమవారం పరామర్శించారు. లింగమూర్తి డ్యూటీ చేస్తూ భార్య అంజవ్వను సీపీఐ కార్యక్రమాల్లో పాల్గొనేలా చేసేవాడని, ముప్ఫై ఏళ్లుగా ఆర్టీసీలో పనిచేస్తున్న ఆయన మృతి బాధాకరమని, కుటుంబానికి సీపీఐ అండగా ఉంటుందన్నారు. పరామర్శలో నాయకులు బూడిద సదాశివ, బొలుమల్ల రాజయ్య, బీస లక్ష్మి పలువురు ఉన్నారు.

పరామర్శ

ఇల్లందకుంట: మండలంలోని వాగొడ్డురామన్నపల్లి గ్రామానికి చెందిన కారింగుల స్వప్నరాజేందర్ కూతురు శివాన్వి(7) ఇటీవల పాముకాటుకు గురికాగా సోమవారం కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ పరామర్శించారు. పాప పరిస్థితిని అడిగితెలుసుకున్నారు. కార్యక్రమంలో గ్రామశాఖ, పార్టీ మండల నాయకులు పాల్గొన్నారు.

వ్యవసాయ అధికారుల క్షేత్ర సందర్శన

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని రంగాపూర్, రాంపూర్ గ్రామాల్లోని పంటలను సోమవారం వ్యవసాయాధికారులు సందర్శించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరిలో తెగుళ్ల నివారణకు చేపట్టాల్సిన చర్యలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏడీఏ సునీత, ఏవో భూమిరెడ్డి, ఏఈవో నిఖిల్‌కుమార్, రైతులు ఉన్నారు.

జమ్మికుంట: మండలంలోని మడిపల్లి గ్రామంలో ప్రపంచ ప్రత్తి దినోత్సవం పురస్కరించుకొని కేవీకే ఆధ్వర్యంలో పత్తిని ఆశించే పురుగు నివారణపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శాస్త్రవేత్త శ్రీనివాస్‌రెడ్డి, ఏఈవో రామ్‌ప్రసాద్, బీసీఏ ఇన్‌చార్జి మహేందర్, రమేశ్, రాజేశ్, విష్ణు, ప్రవీణ్ రైతులు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: మండలంలోని టేకుర్తి గ్రామంలో క్షేత్ర సందర్శనలో భాగంగా ఏడీఏ సునీత సోమవారం పంటపొలాలను పరిశీలించారు. తెగుళ్ల నివారణకు రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఈఓ సంపత్ యాదవ్, గ్రామ కోఆర్డినేటర్ యామశ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

గన్నేరువరం: మండలంలోని మైలారం గ్రామంలో తోట ప్రశాంత్ పొలంలో ప్రభాత్ సీడ్స్ కంపెనీ ఆధ్వర్యంలో మొక్కజొన్న పంటను సందర్శించారు. కంకి పొడవు, సైజ్ ఎక్కువ ఉందని, అధిక దిగుబడి వస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా రైతును కంపెనీ ప్రతినిధులు మహిపాల్, అనిల్, ఉదయ్‌రెడ్డి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



గన్నేరువరం: మైలారంలో మొక్కజొన్న సందర్శన

క్రైం వార్తలు

పీడీఎస్ బియ్యం పట్టివేత

చొప్పదండి: పట్టణంలో అక్రమంగా నిల్వ చేసిన పీడీఎస్ బియ్యాన్ని పట్టుకొని ముగ్గురిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ గొల్లపల్లి అనూష తెలిపారు. చొప్పదండికి చెందిన ముగ్గురు అధిక ధరకు బియ్యం కొనుగోలు చేసి మంచిర్యాలకు తరలించే ప్రయత్నంలో కరీంనగర్‌కు చెందిన టాస్క్‌పోర్స్ పోలీసులు గుర్తించి వాహనంతో సహా నలభై క్వింటాళ్ల బియ్యం పట్టుకున్నారని, ఓవ్యక్తి ఇంటిలో మరో పది క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేశామన్నారు. ముగ్గురితో పాటు వాహన డ్రైవర్‌పై కేసు నమోదు చేశామన్నారు.

హుజూరాబాద్‌రూరల్: పట్టణ శివారులోని సిర్సపల్లి క్రాస్‌రోడ్డు వద్ద పది క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకొని ముగ్గురిపై కేసు నమోదు చేశామన్నారు. చెల్పూర్ గ్రామ పరిధి తోకలపల్లి వద్ద అక్రమంగా తరలిస్తున్న ఆరు క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో మేకలు మృతి

మానకొండూర్: మండలంలోని శంషాబాద్ గ్రామ శివారు మందకుంటలో సోమవారం విద్యుత్ షాక్‌తో రెండు మేకలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన గడ్డి ఐలయ్య మేకలు కుంటలోని కోల్‌బాయ్ వద్ద మేత మేస్తుండగా నీటిలో ఉన్న ఇనుప స్తంభానికి విద్యుత్ సరాఫరా కావడంతో మేకలు అక్కడికక్కడే మృతి చెందాయి.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

హుజూరాబాద్‌రూరల్: పట్టణ శివారులోని పర్కాల్ క్రాస్‌రోడ్డు వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలు..ఎల్కతుర్తి మండలం వీరనారాయణపూర్ గ్రామానికి చెందిన జూపాక రమేశ్ బైక్‌పై స్వగ్రామం వెళ్తుండగా బోలెరో వాహనం వెనుక నుంచి ఢీకొట్టింది.

పశుగ్రాసం దగ్ధం

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ గ్రామంలో షార్ట్‌సర్క్యూట్‌తో రైతు కొలని స్వామికి చెందిన 250 గడ్డికట్టలు దగ్ధమయ్యాయి. గడ్డి కుప్పల పైనుంచి వెళ్తున్న విద్యుత్ తీగల నుంచి నిప్పురవ్వలు గడ్డిపై పడ్డాయి.

దంపతులకు గాయాలు

శంకరపట్నం: మోపెడ్ వెనుక చక్రంలో చీరకొంగు చుట్టుకొని దంపతులకు తీవ్రగాయాలైన సంఘటన తాడికల్ శివారులో సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు... తిమ్మాపూర్ మండలం పొలంపల్లి గ్రామానికి చెందిన దంపతులు జగన్ అరుణ కేశవపట్నం నుంచి ఇంటికి వెళ్తుండగా అరుణ చీరకొంగు వెనుక చక్రంలో చిక్కుకోవడంతో పడిపోయారు. వెంటనే ప్రయాణికులు, స్థానికులు ఆటోలో ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ మృతి

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట కుచెందిన కళ్లెం చిరంజీవి (27) చికిత్స పొందుతూ మృతిచెందినట్టు పోలీసులు తెలిపారు. మద్యానికి బానిసైన చిరంజీవి జీవితంపై విరక్తి చెందిన సోమవారం ఉదయం క్రిమిసంహారక మందు తాగాడు. కుటుంబ సభ్యులు కరీంనగర్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తల్లి బుచ్చమ్మ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వి.శేఖర్ వివరించారు.

వీణవంక: మల్లారెడ్డిపల్లికి చెందిన మీసా వెంకటేశ్ (30)చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. వెంకటేశ్ అనారోగ్య సమస్యలతో ఆసుపత్రుల చుట్టూ తిరుగు తూ మానసికంగా కుంగిపోయి మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 4న పురుగు మందు తాగాడు. కరీంనగర్‌కు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి భార్య సంధ్యారాణి ఫిర్యాదుతో దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తిరుపతి తెలిపారు.